సాక్షి
విశాఖపట్నం
సోమవారం। 26। జూన్। 2023



కిక్ బాక్సింగ్ విజేతలు వీరే

త్రీ కిక్‌బాక్సింగ్ పోటీల్లో మహిళల విభాగంలో జి.అర్పిత, పురుషుల విభాగంలో పృథ్వీ విజేతలుగా నిలిచారు. 8లో



బోటు షికారు పునఃప్రారంభం

రుషికొండ బీచ్‌లో వర్షాల కారణంగా 4 రోజులుగా నిలిపివేసిన బోటు షికారును ఆదివారం పునఃప్రారంభించారు. 8లో



'ఎకో వైజాగ్'పై ప్రచారం

ఎకో వైజాగ్ క్యాంపెయిన్‌లో భాగంగా ఆదివారం సాగరతీరంలో బ్రహ్మకుమారీలు ప్రచారం నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

వామనావతారంలో జగన్నాథుడు



బలభద్రుడు, సుభద్రతో జగన్నాథుడు

డాబాగార్డెన్స్ : జగన్నాథుడి రథోత్సవాలు నగరంలో కనులపండువగా జరుగుతున్నాయి. టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కొలువుదీరిన స్వామి ఆదివారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజలు, లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నేవల్ డాక్‌యార్డ్ బృందంచే విష్ణుసహస్రనామ పారాయణ, గోవిందనామ సంకీర్తన, హనుమాన్ చాలీసా నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు నృత్యభారతి డ్యాన్స్ అకాడమీ మౌనిక సారథ్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. సోమవారం స్వామి పరశురామావతారంలో దర్శనమివ్వనున్నారు.

పుష్పయాగానికి పూలు తరలింపు



వివిధ రకాల పుష్పాలను సిద్ధం చేస్తున్న భక్తులు

ఎంవీపీకాలనీ: తిరుమల శ్రీ గోవిందరాజ స్వామి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. కార్తీక దినోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన పూలు యాగానికి పంపించారు. ఆదివారం ఉదయం ఎంవీపీలోని టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ వద్ద ఈ పూలను ప్రదర్శించారు. తొలుత మహిళా భక్తులు పూలను అందంగా తీర్చిదిద్ది ప్యాకింగ్ చేశారు. అనంతరం సంకల్పం చేసి శాస్త్రోక్తంగా పుష్పయాగం కోసం తిరుమలకు ఈ పూలు తరలించారు. వీటిలో కలువలు, తామరలు, తులసి, మల్లి, జాజి, సంపంగ ఇలా వివిధ రకాలకు చెందిన పూలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ, అధ్యాత్మికవేత్త సత్యకుమార్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు

కేటగిరీ-ఏ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

దొండపర్తి: ప్రజాశాంతికి భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని నగర పోలీసులు రౌడీషీటర్లను హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఇటీవలే నగరంలోని రౌడీషీటర్లను పలు కేటగిరీలుగా విభజించారు. ఇందులో కేటగిరీ-ఏ కింద గుర్తించిన రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ ఉన్న వారికి ఆదివారం ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేయడంతో పాటు నగర బహిష్కరణ విధిస్తామని స్పష్టం చేశారు.

అప్పన్నను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపిక అందిస్తున్న అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రధరి సింగ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి అష్టోత్తరంపూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయ ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను, శేషవస్త్రాన్ని దేవస్థానం అధికారులు న్యాయమూర్తికి అందజేశారు.

'ఆటోమేటెడ్'తో లెక్క పక్కా

- త్వరలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ అందుబాటులోకి..
- వాహన సామర్థ్య పరీక్షల్లో కచ్చితత్వం
- రాష్ట్రంలో తొలిసారిగా గంభీరంలో ఏర్పాటు
- రూ.16.5 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ఇకపై మాన్యువల్ టెస్ట్‌లకు స్వస్తి



పూర్తికావస్తున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్



నిర్మాణం పూర్తి చేసుకున్న డ్రైవింగ్ ట్రాక్

సాక్షి, విశాఖపట్నం: వాహనాల సామర్థ్య పరీక్షల నిర్వహణకు సరికొత్త టెస్టింగ్ స్టేషన్ అందుబాటులోకి వస్తోంది. విశాఖ జిల్లా రవాణా శాఖకు సంబంధించి రాష్ట్రంలోనే తొలిసారిగా ఆనందపురం మండలం గంభీరంలో ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ఏర్పాటవుతోంది. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఈ స్టేషన్‌కు రూ.16.5 కోట్లు మంజూరు చేసింది. దీనికి అదనంగా డ్రైవింగ్ ట్రాక్‌కు రూ.కోటి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.75 లక్షలు కేటాయించింది. ప్రస్తుతం ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇంకా రూఫ్ షీట్, ఫ్లోరింగ్ వంటి సివిల్ పనులు జరుగుతున్నాయి. అలాగే డ్రైవింగ్ ట్రాక్ రోడ్ల పనులు పూర్తయ్యాయి. ఈ రోడ్లపై సెన్సార్లను అమర్చాల్సి ఉంది. ఈ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి కానుంది. మరో నెలన్నర రోజుల్లో దీనిని ప్రారంభించేందుకు రవాణా శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఇప్పటి వరకు ఇలా..

ఇప్పటివరకు బస్సులు, లారీలు, కార్లు, వ్యాన్లు, జీపులు, ఆటోలు వంటి వివిధ వాహనాలకు ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాల్లో మాన్యువల్ విధానంలో సామర్థ్య (ఫిట్‌నెస్) పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ప్రస్తుత మాన్యువల్ విధానంలో నిర్వహించే పరీక్షల్లో పారదర్శకత ఉండడం లేదని, కాలం చెల్లిన వాహనాలు రోడ్లపై తిరిగే సామర్థ్యం లేకపోయినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అంతేకాదు.. మాన్యువల్ విధానంలో వాహన స్థితి పూర్తిస్థాయిలో నిర్ధారించడం కూడా సాధ్యం కావడం లేదు. ఫలితంగా వాహనాల కండిషన్‌పై సమగ్రత లేని సర్టిఫికెట్ల జారీ వల్ల అవి ప్రమాదాలకు గురవుతున్నాయి. కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. ఇకపై ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తే ప్రమాదాలు, కాలుష్యాలను నియంత్రించే వీలుంటుంది.

16 రకాల పరీక్షలు

కొత్త ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లో వాహనాలకు నిర్వహించే పరీక్షలకు మనుషుల ప్రమేయం అవసరం ఉండదు. నిర్దేశిత ప్రమాణాలకనుగుణంగా వాహనాల నాణ్యత, పనితీరు, వినియోగ అర్హత/సామర్థ్యం వంటివి కంప్యూటర్, సెన్సార్ల పరిజ్ఞానంతో ధృవీకరించే వీలుంటుంది. ఇలా ఈ స్టేషన్‌లో పీయూసీ (పొల్యూషన్ అండర్ కంట్రోల్), సౌండ్ టెస్ట్, స్పీడోమీటరు, సైడ్ స్లిప్, సస్పెన్షన్ టెస్ట్, బ్రేక్ టెస్ట్, స్టీరింగ్ టర్నింగ్ యాంగిల్, యాక్సిల్ ప్లే డిటెక్టర్, హెడ్‌లైట్ సెంటరింగ్ వంటి 16 రకాల పరీక్షలను క్షుణ్ణంగా నిర్వహిస్తారు. వాహనాల నుంచి వెలువడిన కాలుష్య కారకాలను గుర్తించి పీయూసీ సర్టిఫికెట్లకు అర్హత ఉన్నదీ, లేనిదీ కంప్యూటర్ ఆపరేటెడ్ డివైజ్‌లు నిర్ధారిస్తాయి. ఎలక్ట్రికల్, మెకానికల్ లోపాలను గుర్తిస్తాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో వాహనంలో ఏ లోపాలున్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీకి వీలుపడదు. కంప్యూటర్ గుర్తించిన లోపాలను సరిచేశాకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ అవుతుంది. మాన్యువల్ సర్టిఫికెట్ మాదిరిగా మార్పులు, చేర్పులకు వీలుండదు. ఇలా ఆటోమేటెడ్ టెస్టింగ్ ద్వారా సంబంధిత వాహనం సామర్థ్య పరీక్షల్లో కచ్చితమైన నివేదిక వస్తుంది. ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లో రోజుకు వంద వరకు వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షించే వీలుంటుంది.

త్వరలో అందుబాటులోకి..



గంభీరంలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. సివిల్ వర్కులు కూడా వేగంగా జరుగుతున్నాయి. డ్రైవింగ్ ట్రాక్ కూడా పూర్తయింది. ఈ రోడ్లపై సెన్సార్లను అమర్చాల్సి ఉంది. మరో నెలన్నరలోపు ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తుంది. ఈ స్టేషన్‌లో ఉండే సాంకేతికతతో వాహనాల సామర్థ్య పరీక్షలు కచ్చితత్వంతో పాటు సమర్థవంతంగా జరుగుతాయి.

– జీసీ రాజారత్నం, డీటీసీ, విశాఖపట్నం

గోధుమ పిండి.. మరింత నాణ్యతగా..

- రేషన్‌కార్డుదారులకు అందించేందుకు చర్యలు
- జిల్లాలో 1800 టన్నుల గోధుమలతో పిండి తయారీ
- ఆరోపణలకు చెక్ పెడుతూ 'సివిల్ సప్లైస్' స్వీయ పర్యవేక్షణ
- 311 మొబైల్ వాహనాల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు



సాక్షి, విశాఖపట్నం : రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సరకులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని జత చేస్తూ రేషన్‌తో పాటు ప్రజలకు గోధుమ పిండిని కూడా సరఫరా చేస్తున్నారు. అయితే, గతంలో గోధుమ పిండిలో మైదా కలుపుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. వీటికి చెక్ పెడుతూ పౌరసరఫరాల కార్పొరేషన్ స్వీయ పర్యవేక్షణలో జిల్లాలోని కార్డుదారుల కోసం 1800 టన్నుల గోధుమలతో పిండిని తయారు చేసి, ప్యాకింగ్ ప్రక్రియ ప్రారంభించింది.

ఫోర్టిఫైడ్ రైస్ విషయంలోనూ రగడ

సామాన్య ప్రజలకు రేషన్ దుకాణాలు, మొబైల్ రేషన్ వ్యాన్‌ల ద్వారా అందిస్తున్న సరకుల నాణ్యత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీ పడటం లేదు. కానీ, ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడిపేసుకుంటున్నాయి. గతంలో పోషకాలు అధికంగా ఉండే ఫోర్టిఫైడ్ రైస్‌ను రేషన్ బియ్యంలో కలిపి ప్రభుత్వం సరఫరా చేసింది. వీటి గురించి తెలియకుండా ప్లాస్టిక్ బియ్యాన్ని, ముతక బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారంటూ విమర్శలు చేసి, చివరికి వాస్తవం తెలుసుకున్న ప్రతిపక్షాలు మిన్నకుండిపోయాయి.

ఇటీవల .. రేషన్ కార్డుదారులకు గోధుమ పిండిని సరఫరాను ప్రారంభించారు. అయితే, ఈ పిండిలో మైదా కలుపుతున్నారంటూ ఆరోపణలు వినిపించాయి. వాస్తవానికి నాణ్యమైన గోధుమ పిండినే ప్రభుత్వం అందించింది. గోధుమలు పిండి చేసే సమయంలో మెత్తగా రావడంతో, మైదా పిండి కలుపుతున్నారనే విమర్శలు వినిపించాయి. ఇకపై, ఇలాంటి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళ్లకుండా ఉండేందుకు సివిల్ సప్లై కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు గోదాములకు చేరుకున్న గోధుమలను స్వయంగా పరిశీలించి, మరపట్టించి.. ప్యాకింగ్ చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు జిల్లాలోని 6 పాయింట్ల వద్ద ఉన్న గోదాముల్లో 1800 టన్నుల గోధుమలను విజయనగరంలోని మిల్లుకు తరలించారు. ఆ మిల్లు వద్ద, గోధుమల్ని మరపడుతున్న సమయంలోనూ, ఆ పిండిని ప్యాక్ చేస్తున్న సమయంలోనూ సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారులు పర్యవేక్షించనున్నారు. గతంలో మాదిరిగా పూర్తిగా పిండిలా కాకుండా ముఖ్యమైన ప్రైవేట్ కంపెనీలు అందిస్తున్న మాదిరిగా కాస్త ముదుకుగా పిండి ఉండేలా మరపట్టే ప్రక్రియను ప్రారంభించారు. వచ్చిన గోధుమ పిండి ప్యాకెట్లను జూలై నెలలో పంపిణీ చేసేందుకు 311 ఎండీయూ వాహనాలకు సరఫరా చేసేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జూలై 1 నుంచి రేషన్ పంపిణీలో మరింత నాణ్యంగా గోధుమ పిండి కార్డుదారులకు అందనుందని అధికారులు స్పష్టం చేశారు.

క్రైస్తవులను చంద్రబాబే నట్టేట ముంచారు

- టీడీపీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల్లో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ



సాక్షి, విశాఖపట్నం: టీడీపీ ప్రభుత్వ హయాంలో క్రైస్తవుల అభివృద్ధికి ఖర్చు చేసిన దాని కన్నా మూడు రెట్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ఖర్చు చేసిందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ అన్నారు. క్రైస్తవుల అభివృద్ధిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని చంద్రబాబు, లోకేష్‌కు సవాల్ విసిరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో క్రైస్తవులను చంద్రబాబు నట్టేట ముంచారని, దళితులు, దళిత క్రైస్తవులపై చంద్రబాబుకు సదాభిప్రాయం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలం చెల్లిన రాజకీయ నాయకుడు చంద్రబాబు, మెచ్యూరిటీ లేని లోకేష్ మాటలను వింటుంటే క్రైస్తవ సమాజం సిగ్గుతో తలదించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. క్రైస్తవుల అభివృద్ధి కోసం టీడీపీ ప్రభుత్వంలో రూ.97,07,28,000 ఖర్చు చేసిందని, కేవలం 9,111 మంది మాత్రమే లబ్ధి పొందారని గుర్తు చేశారు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 282,18,79,000 ఖర్చు చేసిందని, మొత్తం 1,41,266 మందికి పైగా లబ్ధి పొందారన్నారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో పాస్టర్లకు రూ.5 వేలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇది ఓర్వలేక చంద్రబాబు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఏపీ ఆదర్శంగా...

క్రైస్తవుల పుణ్యక్షేత్రమైన జెరూసలేం వెళ్లే యాత్రికులకు టీడీపీ హయాంలో దారిద్ర్యరేఖకు దిగున ఉన్నవారికి రూ.40 వేలు, ఎగువన ఉన్నవారికి రూ.20 వేల రాయితీ కల్పించారని ఆయన వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి రూ.60 వేలు, ఎగువన ఉన్న వారికి రూ.30వేలకు పెంచినట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా క్రైస్తవులకు ప్రత్యేకంగా క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌దన్నారు. తమ ప్రభుత్వ హయాంలో క్రైస్తవ మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి సలహాదారుడుగా మద్దు బాలస్వామి నియమించినట్లు చెప్పారు. మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్, ఆర్టీఐ వైస్ చైర్మన్, ఏపీపీఎస్సీ మెంబర్‌గా కూడా క్రైస్తవులకు అవకాశం కల్పించారన్నారు. ఏపీని తమిళనాడు ప్రభుత్వం కూడా ఆదర్శంగా తీసుకుందన్నారు.

చంద్రబాబు మాటలు మరిచిపోలేదు

రామతీర్థం, అంతర్వేది సంఘటనలు జరిగినప్పుడు క్రైస్తవులను కించపరుస్తూ చంద్రబాబు మాట్లాడిన మాటలు క్రైస్తవ సమాజం ఎప్పటికీ మరచిపోదని జాన్‌వెస్లీ తెలిపారు. ఆ రోజు చంద్రబాబు మాట్లాడుతూ క్రైస్తవులు ఇతర మతాల వారిపై దాడులకు పాల్పడుతున్నారని, బలవంతపు మతమార్పిడులు చేస్తున్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించడం ఇంకా గుర్తే అని అన్నారు. బలవంతపు మతమార్పిడులు జరుగుతున్నాయని చెబుతున్న మీరు.. అలా ఎక్కడైనా జరిగినట్లు నిరూపించగలరా అని సవాల్ విసిరారు. క్రైస్తవుల పట్ల మీరు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా 35 ఏళ్ల పాటు టీడీపీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే ఫిలిప్స్ తోచర్ రాజీనామా చేయడం నిజం కాదా..? అన్ని జిల్లాల తెలుగుదేశం క్రిస్టియన్ సెల్స్ అధ్యక్షులు రాజీనామాలు చేస్తామని చెప్పి గుంటూరులో సమావేశం ఏర్పాటు చేసి మీ మీద తిరుగుబాటు చేయడం నిజం కాదా..? అని ప్రశ్నించారు.

ప్రేమ సమాజం అధ్యక్షుడిగా బుద్ద శివాజీ



సభ్యులతో బుద్ద శివాజీ

అల్లిపురం: ప్రేమ సమాజం అధ్యక్షుడిగా బుద్ద శివాజీ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి టీవీ నారాయణరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ప్రేమసమాజంలో జరిగిన ఎన్నికల్లో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా బుద్ద శివాజీ, ఉపాధ్యక్షులుగా మట్టపల్లి హనుమంతరావు, కేశ ప్రగడ నర్సింహమూర్తి, కోశాధికారిగా ఎంవీకే గుప్తాలను ఎన్నుకోగా, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా 20 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2023-2025 వరకు కొనసాగనుందని పేర్కొన్నారు. ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు సభ్యులు అభినందించారు.

నేడు జగనన్నకు చెబుదాం, డయల్ యువర్ మేయర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు మేయర్ చాంబర్‌లో డయల్ యువర్ మేయర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ఉంటుంది. నగర పౌరులు ఈ కార్యక్రమాల ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

మరోసారి పగిలిన 'తాటిపూడి'



రోడ్డుపై వృథాగా పోతున్న నీరు

దొండపర్తి: తాటిపూడి పైప్‌లైన్ మరోసారి పగిలింది. నాయుడుతోట నుంచి గోపాలపట్నం వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారిలో పైప్‌లైన్ ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా పేలడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. వేల లీటర్ల తాగునీరు వృథా అయింది. ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు నీటిసరఫరా విభాగం ఎస్‌ఈ వేణుగోపాల్ తన బృందంతో కలిసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. రాత్రి 10 గంటల సమయంలో పనులు పూర్తి చేశారు. పైప్‌లైన్ పగలడం వల్ల టీఎస్సార్ కాంప్లెక్స్‌కు రావాల్సిన నీరు అందలేదు. సోమవారం ఉదయం సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. పైప్‌లైన్ భూగర్భ మార్గంలో వెళ్తుండగా.. దానిపై అక్రమ నిర్మాణాలు ఉండటం వల్ల ఒత్తిడి పెరుగుతుండటంతో తాటిపూడి పైప్ లైన్ తరచూ పగిలిపోతోంది. దీనిపై గతంలో విజిలెన్స్ బృందం నివేదిక ఇచ్చినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా జీవీఎంసీకి ఏటా తాటిపూడి మరమ్మతులకు రూ.లక్షలు చేతి చమురు వదులుతోంది.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : ఖరగ్‌పూర్ డివిజన్, ఖరగ్‌పూర్ - భద్రక్ సెక్షన్, బహనగర బజార్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ట్రాక్ నిర్వహణ పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. షాలిమార్ - హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ - షాలిమార్ (18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి - తాంబరం (22841) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - డిబ్రూఘడ్ (07046) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - అగర్తలా (07030) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి - సంత్రగచ్చి (22856) ఎక్స్‌ప్రెస్, ఎర్నాకుళం - హౌరా (22878) ఎక్స్‌ప్రెస్, హౌరా - ఎస్ఎంవీ బెంగళూరు (22863) ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు - హౌరా (22864) ఎక్స్‌ప్రెస్, అగర్తలా - ఎస్ఎంవీ బెంగళూరు (00636) ఎక్స్‌ప్రెస్‌లను జూన్ 26న రద్దు చేశారు.

పలు రైళ్ల గమ్యం కుదింపు

వాల్తేర్ డివిజన్, కేకే లైన్ పరిధిలో భద్రతా కారణాల వల్ల ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు అధికారులు తెలిపారు. • విశాఖపట్నంలో రోజూ రాత్రి బయల్దేరే విశాఖపట్నం - కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 25 నుంచి జూలై 1 వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. • కిరండూల్‌లో రోజూ రాత్రి బయల్దేరే కిరండూల్ – విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 26 నుంచి జూలై 2 వరకు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. • విశాఖపట్నంలో రోజూ బయల్దేరే విశాఖపట్నం - కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ జూన్ 25 నుంచి జూలై 2 వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. • కిరండూల్ - విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రైలు జూన్ 26 నుంచి జూలై 3 వరకు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

దగ్గరగా దూరవిద్య

- ప్రవేశాల సంఖ్యలో గణనీయమైన వృద్ధి
- సెమిస్టర్ విధానంలో పరీక్షల ప్రక్రియ
- ఆన్‌లైన్‌లో విద్యార్థులకు సమర్థ సేవలు



ఏయూ దూరవిద్య కేంద్రం

దూరవిద్య కేంద్రంలో ఐదేళ్లుగా ప్రవేశాలను పరిశీలిస్తే.. నూతన విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది.

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య
2018-19	10,292
2019-20	16,200
2020-21	15,151
2021-22	21,751
2022-23	30,566

2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల సంఖ్యను రెట్టింపు చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఏయూక్యాంపస్: అందుబాటులో ఉన్న సాంకేతికతను అనుకూలంగా మార్చుకుంటూ.. ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం తన సేవలను విద్యార్థులకు మరింత చేరువ చేస్తోంది. మారుమూల గ్రామాల నుంచి అంతర్జాతీయంగా పలు దేశాలకు విస్తరిస్తోంది. మొత్తం మీద కొన్నేళ్లుగా దూరవిద్య కేంద్రం ప్రాశస్త్యం పెరుగుతోంది. తాజాగా ఆన్‌లైన్‌లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించారు. సెమిస్టర్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఒక్క క్లిక్‌తో సమస్త సేవలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యలో ప్రవేశాల నుంచి పరీక్షల వరకు సమస్త సేవలను ఒక్క క్లిక్‌తో పొందేలా అధికారులు చర్యలు చేపట్టారు. దూర విద్య కేంద్రానికి రాకుండానే విద్యార్థి తను ఉన్న ప్రాంతం నుంచే https://www.andhrauniversity-sde.com/ను సందర్శించి నేరుగా ప్రవేశం పొందవచ్చు. ఏటా అకడమిక్ ఇయర్‌గా జూలై, క్యాలెండర్ ఇయర్‌గా జనవరిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ప్రవేశాల నుంచి కోర్సు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తారు. విద్యార్థి ప్రవేశం పొందే సమయంలోనే ఫీజులు సైతం చెల్లించి, నేరుగా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పించారు. ప్రతి విద్యార్థికీ ఒక లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను అందిస్తారు. ప్రవేశం పొందిన తర్వాత విద్యార్థి తన లాగిన్ నుంచి నేరుగా సిలబస్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు.


వాట్సాప్ గ్రూప్‌ల ఏర్పాటు

ప్రతీ కోర్సులో 30 మార్కులకు అసైన్‌మెంట్, 70 మార్కులకు వార్షిక పరీక్ష ఉంటాయి. అసైన్‌మెంట్‌కు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సైతం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే ప్రవేశాలు పొందిన విద్యార్థులతో వాట్సాప్ గ్రూప్‌లు రూపొందించి, సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి అన్ని కోర్సులకు సెమిస్టర్ విధానం అమలు చేయనున్నారు. పరీక్షల్లో పారదర్శకత పెంచడానికి ఓఎంఆర్ విధానం అమలు చేస్తున్నారు.

డిగ్రీ విద్యార్థులకు అప్రెంటిస్

బీఏ, బీకాం దూరవిద్యలో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్టైఫండ్‌తో కూడిన అప్రెంటిస్ అందించే దిశగా అధికారులు పనిచేస్తున్నారు. వివిధ పరిశ్రమలతో అనుసంధానం చేసుకుని, వీరికి వేతనంగా కూడిన శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. వచ్చే నెలలో ప్రవేశం పొందే విద్యార్థుల నుంచి అన్ని కోర్సులకు గ్రేడింగ్, సెమిస్టర్ విధానం అమలు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏయూ దూర విద్యాకేంద్రానికి 98కి పైగా పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచి విద్యార్థి ప్రవేశం పొందినా.. సమీపంలోని పరీక్షల కేంద్రాలనే కేటాయిస్తారు.

ఆన్‌లైన్‌లో కోర్సులు



విదేశీ విద్యార్థులకు సైతం చదువుకునే వెసులుబాటు కల్పించారు. ప్రస్తుతం ఎం.ఏ సోషియాలజీ, బీకాం కోర్సులు ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. త్వరలో ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంకాం కోర్సులను సైతం ఆన్‌లైన్‌లో నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఏయూ దూరవిద్య కేంద్రం సామాజిక బాధ్యతగా ఖైదీలు, దివ్యాంగులకు ఉచితంగా విద్య అందిస్తోంది.

నూతన విధానాలతో సత్ఫలితాలు



అధిక శాతం మందికి దూరవిద్యను చేరువ చేసే విధంగా నూతన విధానాలు అమలు చేస్తున్నాం. ప్రస్తుతం అమలు చేస్తున్న ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాల ప్రక్రియకు మంచి ఆదరణ లభిస్తోంది. విద్యార్థులకు వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– ఆచార్య కె.విశ్వేశ్వరరావు, సంచాలకుడు, ఏయూ దూరవిద్య కేంద్రం

ఇంటి నుంచే సేవలు



సాంకేతికతను ఉపయుక్తంగా మార్చుకోవడంలో ఏయూ ముందుంటుంది. విద్యార్థి దూరవిద్య కేంద్రానికి రాకుండా ఇంటి వద్ద నుంచే ప్రవేశం పొందడం, పరీక్ష ఫీజుల వరకు అన్నీ చెల్లించే అవకాశం కల్పించాం. విద్యార్థి స్టడీ మెటీరియల్ కూడా ఆన్‌లైన్‌లో నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏయూ వీసీ, అధికారులు అందిస్తున్న సహకారంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాం.

–ఆచార్య ఎం.వి.ఎస్ చంద్రశేఖర్, అనుబంధ ప్రొఫెసర్, ఏయూ దూరవిద్య కేంద్రం

వ్యాపార లక్ష్యం రూ.7,728 కోట్లు

కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు చలసాని



మాట్లాడుతున్న చలసాని రాఘవేంద్రరావు

మద్దిలపాలెం : ది విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో రూ.7,728.43 కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నామని బ్యాంకు అధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు అన్నారు. బ్యాంకు 108వ మహాజన సభ మద్దిలపాలెంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ రూ.4,350 కోట్ల డిపాజిట్లు సేకరించాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. అదే విధంగా రూ.3,378 కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. కాగా 2022 – 23 ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదికలో భాగంగా రూ.3,929 కోట్ల డిపాజిట్లు సేకరించగా, రుణాలు రూ.3,050 కోట్లు ఇచ్చామన్నారు. దీంతో వ్యాపారం రూ.7,026 కోట్లు సాగిందని వివరించారు. బ్యాంకు సభ్యులు 92,831 మంది కాగా షేర్ ధనం రూ.305 కోట్లు నమోదయిందన్నారు. దీంతో దేశంలో నాలుగో స్థానంలో నిలిచిందని ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.73.14కోట్లు లాభాలు ఆర్జించామని పేర్కొన్నారు. బ్యాంకు రిజర్వ్‌నిధి రూ.389 కోట్లుకాగా ఆస్తులు రూ.179 కోట్లని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వాల సెక్యూరిటీలు, ఇతర బ్యాంకులలో పెట్టుబడులు రూ.1,620 కోట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. మానం అంజనేయులు మాట్లాడుతూ సహకార బ్యాంకులపై రిజర్వ్ బ్యాంకు అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సహకార రంగంలో సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన విశ్వనాథన్ కమిటీ సిఫార్సులు, జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలన తర్వాత ప్రస్తుతం చట్టంచేసే దశలో ఉందని తెలిపారు. బ్యాంకుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ పాలక వర్గం ఆలోచనలు చేయాలని సూచించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సీనియర్ వైస్ చైర్మన్ బి.భాస్కరరావు, బ్యాంకు డైరెక్టర్లు ఎస్.నాగభూషణం, జె.వి.సత్యనారాయణ మూర్తి, ఎ.జె.స్టాలిన్, ఎస్.కామరాజు, కె.భవాని, తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ కావాలా.?

- 10 మొక్కలు నాటండి.. ఎందుకంటే.?
- వాల్తేరు డీఆర్‌ఎం కొత్త నిబంధన

సాక్షి, విశాఖపట్నం: నాతో మీకు సెల్ఫీ కావాలా? అయితే పర్యావరణ పరిరక్షణ కోసం 10 మొక్కలు నాటండి.. అప్పుడే మీకు సెల్ఫీ ఇస్తాను. లేదంటే.. లేదు.. ఇదీ వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలు. సెల్ఫీ కోసం ఎందుకీ నిబంధనలు అనేగా మీ డౌటనుమానం! అయితే ఈ కథనం చదివేయండి.

ఇటీవల వాల్తేరు డివిజన్ పరిధిలో రైల్వే ఉద్యోగాలు ఇస్తామంటూ పలువురు మోసగాళ్లు.. నిరుద్యోగులకు వల విసిరారు. రూ.లక్షల వసూళ్లకు పాల్పడి మోసం చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. వీరిలో చాలా మంది మోసగాళ్లు డీఆర్‌ఎంతో సెల్ఫీ దిగిన ఫొటోలను యువతకు చూపించి మోసం చేసినట్లు రైల్వే అధికారులు గుర్తించారు. డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి తమకు బాగా తెలుసని.. ఆయనకు మేం ఎంత చెబితే అంత అని చెబుతూ నిరుద్యోగులకు వల వేస్తున్నట్లు విచారణలో తేలింది. వీళ్లంతా ఎవరని ఆరా తీస్తే.. కొన్ని రైల్వే కార్యక్రమాల్లో ఉద్యోగులు, సిబ్బందిగా పాల్గొని డీఆర్‌ఎంతో సెల్ఫీలు దిగినట్లుగా గుర్తించారు. ఈ తరహా మోసగాళ్లకి చెక్ పెట్టేందుకు మార్గ దర్శకాలు జారీ చేయాలని తన కార్యాలయ వర్గాలను డీఆర్‌ఎం ఆదేశించారు. అందుకే డీఆర్‌ఎం సెక్రటేరియట్ నుంచి వాల్తేరు డివిజన్ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ రెండు రోజుల కిందట మార్గదర్శకాలు విడుదలయ్యాయి. రైల్వే అధికారిక కార్యక్రమాల్లో ఇతరులెవ్వరూ హాజరుకాకుండా చర్యలు తీసుకోవాలని, రైల్వే ఉద్యోగులెవ్వరైనా డీఆర్‌ఎంతో సెల్ఫీ దిగొచ్చని స్పష్టం చేశారు. బయట వ్యక్తులెవ్వరైనా సెల్ఫీ అడిగితే.. వారు కచ్చితంగా క్యాలెండర్ ఈయర్‌లో 10 మొక్కలు నాటుతామని హామీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. సెల్ఫీ దిగే వ్యక్తిపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని స్పష్టం చేయడంతో పాటు పూర్తి వివరాలను డీఆర్‌ఎం సెక్రటేరియట్‌కు అందించాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు. రైల్వే సిబ్బందిలో ఎవరిపైనైనా క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన కేసున్నుంటే.. వారు డీఆర్‌ఎంతో సెల్ఫీ తీసుకోడానికి వీల్లేదంటూ పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి మోసపూరిత కార్యక్రమాలకు డీఆర్‌ఎం ఫొటో వినియోగించకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కార్యాలయ వర్గాలు స్పష్టం చేశాయి. అయితే.. 10 మొక్కలు నాటి డీఆర్‌ఎంతో సెల్ఫీ కోసం ఎవరు పోటీ పడతారంటూ వాల్తేరు ఉద్యోగ, కార్మిక వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ సర్క్యులర్ డివిజన్ పరిధిలో చర్చనీయాంశంగా మారింది.



డీఆర్‌ఎం కార్యాలయం

చదరంగం పోటీల్లో భార్గవ్, రుత్విక్ విజేతలు

- సత్తాచాటిన సత్యతేజేశ్వర్
- ఉత్సాహంగా చదరంగం పోటీలు



తనీష్‌తో తలపడుతూ ఎత్తుకుపైఎత్తుతో చిత్తుచేసిన తేజేశ్వర్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా రాపిడ్ చదరంగం పోటీల్లో భార్గవ్‌రామ్, బ్లిజ్ చదరంగంలో వెంకట్‌రుత్విక్ విజేతలుగా నిలిచారు. రెండు అంశాల్లోనూ సత్యతేజశ్వర్ సత్తా చాటాడు. రాపిడ్ చెస్ 76 మంది ఏడు రౌండ్లలో పోటీపడగా బ్లిజ్‌లో 44 మంది ఆరురౌండ్లలో పోటీపడ్డారు. రాపిడ్‌లో భార్గవ్ ఏడు పాయింట్లతో నిలవగా సత్యతేజేశ్వర్ ఆరుపాయింట్లతో రన్నరప్‌గా నిలిచాడు. రాపిడ్ చివరి రౌండ్‌లో సాయిశశాంక్‌పై భార్గవ్‌రామ్ విజయంతో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. బ్లిజ్‌లో వెంకట్ రుత్విక్ ఆరుపాయింట్లు సాధించగా సత్యతేజశ్వర్ ఐదు పాయింట్లతో నిలిచాడు. బ్లిజ్ చివరి రౌండ్‌లో వై.భార్గవ్‌పై వెంకటరుత్విక్ ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. రాపిడ్‌లో కృష్ణ ఆరు పాయింట్లు సాధించగలిగినా ప్రొగ్రెసివ్‌లో వెనుకబడి తృతీయ స్థానంతో సరిపుచ్చాడు. బ్లిజ్‌లో సాయిభార్గవ్, సాయిశశాంక్‌లు సైతం ఐదేసి పాయింట్లు సాధించగలిగినా ట్రై బ్రేక్స్ వెనుకబడటంతో వరుసగా మూడు, నాలుగు స్థానాల్లోనే నిలిచిపోయారు. ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణామందిర్‌లో ఆదివారం ఈ పోటీలు జరిగాయి. ఆయా పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన ఆటగాళ్లు జిల్లా జట్టుగా భీమవరంలో జరగనున్న స్టేట్ అంతర జిల్లాల టోర్నీలో పాల్గొనున్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

గతంలోనూ మూడు సార్లు ఆత్మహత్యాయత్నం



ఆదినారాయణ(ఫైల్)

గోపాలపట్నం: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్ఏడీ రైల్వే వంతెన దిగువన ఈ ఘటన చోటు చేసుకుంది. గతంలోనూ మూడుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు కాపాడారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. మురళీనగర్‌కు చెందిన బల్లంకి ఆదినారాయణ(23) డ్రైవర్‌గా, కొరియర్ బాయ్‌గా చిన్నచిన్న పనులు చేసుకుంటూ తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను రాత్రికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం రైల్వే ట్రాక్‌పై మృతదేహం ఉందన్న సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సెల్‌ఫోన్, దుస్తులు ఆధారంగా ఆదినారాయణగా గుర్తించారు. శనివారం రాత్రి అతను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని జీఆర్పీ పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న అతని కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని.. ఛిద్రమైన మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. గతంలో బైక్ కొని ఇవ్వలేదని ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నిస్తే.. కుటుంబ సభ్యులు గుర్తించి ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ఆదినారాయణ ప్రాణాలతో బయటపడ్డాడు. ఇలా మరో రెండు సార్లు ఆత్మహత్యకు పాల్పడ్డాడని.. అదృష్టవశాత్తూ ఏం జరగలేదని బంధువులు చెబుతున్నారు. ఈ సారి మాత్రం తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని విలపించారు. కాగా.. శనివారం రాత్రి 11 గంటలకు ఆదినారాయణ తన స్నేహితుడైన మౌళి ఫోన్ చేసి చనిపోతున్నట్లు చెప్పాడు. మౌళి ఈ విషయాన్ని ఆదినారాయణకు అన్నయ్యకు తెలిపాడు. అతను ఆదినారాయణకు ఫోన్ చేయగా.. నేను రైల్వే ట్రాక్‌పై ఉన్నాను.. ట్రైన్ దగ్గరకు వచ్చేస్తోంది అని చెబుతుండగానే ఫోన్ ఆగిపోయింది. అతని ఆత్మహత్యకు గల కారణం తెలియరాలేదు. తన కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నామని, ఇంట్లో ఎటువంటి గొడవలు జరగలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. తండ్రి బల్లంకి బంగారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

‘ఎకో వైజాగ్’పై బ్రహ్మకుమారీల ప్రచారం

బీచ్‌రోడ్డు: ప్రతీ మనిషి ఇల్లు, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి శివలీల అన్నారు. ఎకో వైజాగ్ క్యాంపెయిన్‌లో భాగంగా ఆదివారం సాగరతీరంలో బ్రహ్మకుమారీలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు జీవీఎంసీ ప్రతిష్టాత్మకంగా ‘ఎకో వైజాగ్’ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో విశాఖను మొదటి స్థానంలో నిలబెట్టేందుకు నగరవాసులు జీవీఎంసీకి సహకరించాలని కోరారు. అనంతరం బ్రహ్మకుమారీలు ధ్యానం చేశారు.

బోటు షికారు పునఃప్రారంభం



సందర్శకులతో కిటకిటలాడుతున్న ఆర్.కె.బీచ్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం అయిన రుషికొండ బీచ్‌లో వర్షాల కారణంగా నాలుగు రోజులుగా నిలిపివేసిన బోటు షికారును ఆదివారం సాయంత్రం పునఃప్రారంభించారు. అదే విధంగా సాయంత్రం నుంచి ఆర్కే బీచ్, సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ, భీమిలి బీచ్ ప్రాంతాల్లో పర్యాటకులతో కిటకిటలాడాయి.

కిక్ బాక్సింగ్ పోటీల విజేతలు అర్షిత, పృథ్వీ

విశాఖ స్పోర్ట్స్: విశాఖ డిస్ట్రిక్ట్ కిక్‌బాక్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ ప్రో కిక్‌బాక్సింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. గోకుల్ పార్క్ వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో 18 జిల్లాల నుంచి 70 మంది బాక్సర్లు పాల్గొన్నారు. 51 కేజీల మహిళా విభాగంలో విశాఖ జిల్లాకు చెందిన బి.అర్షిత విజేతగా నిలవగా తూర్పుగోదావరికి చెందిన అక్షిత ద్వితీయ స్థానంలో నిలిచింది. మెన్ విభాగంలో పృథ్వీ, బాల తొలి రెండు స్థానాల్లో నిలిచారు. పోటీల ముగింపు కార్యక్రమానికి కిక్‌బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు కరణంరెడ్డి నరసింగరావు, సామాజికవేత్త జి.వి.రామచంద్రరావు హాజరై విజేతలకు ట్రోఫీలందించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శిబిరం ప్రారంభిస్తున్న డీసీపీ విద్యాసాగర్ నాయుడు సతీమణి భవ్య

సీతమ్మధార: మనోజ్ వైభవ్ జెమ్స్, జ్యూయలర్స్ లిమిటెడ్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత మనోజ్ కుమార్ గ్రంధి 57వ జయంతి సందర్భంగా ద్వారకానగర్‌లోని షోరూంలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, మ్యాక్సివిజన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం జరిగింది. డీసీపీ వి.విద్యాసాగర్ నాయుడు, ఆయన సతీమణి భవ్య ఈ శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మనోజ్‌కుమార్ ఎందరో పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకమన్నారు. అద్భుతమైన బంగారు ఆభరణాలు, డిజైన్లు, అత్యున్నత సేవలతో పాటు స్నేహపూరిత వాతావరణంలో వినియోగదారుల ఆదరణను చూరగొనడం అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరంలో 93 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. సంస్థ చైర్‌పర్సన్ భారత మల్లికా రత్నకుమారి, డైరెక్టర్ సాయికీర్తన, సీవోవో రఖాల్, కంకటాల మల్లిక్, వైభవ్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

సీపీ త్రివిక్రమ్ వర్మ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

మద్దిలపాలెం: ప్రమాదం ఏదైనా సరైన అవగాహనతోనే ప్రాణనష్టాన్ని నివారించవచ్చని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ అన్నారు. కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద గల ఫెయిర్‌ఫీల్డ్ మారియట్ హోటల్‌లో ఆదివారం ట్రామా ఎమర్జెన్సీ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమన్నారు. సదస్సుకు హాజరైన పలు కంపెనీ ప్రతినిధులకు భద్రత పరమైన సూచనలు చేశారు. ప్రాణాలు రక్షించేందుకు వైద్యులు పడే తాపత్రాయాన్ని, వైద్యుడిగా ఉన్న సమయంలో తాను చూసిన ప్రమాదాల అనుభవాలను సదస్సులో పంచుకున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ మాట్లాడుతూ ఆస్పత్రికి ప్రతి రోజూ వైద్య సేవల కోసం ప్రమాద బాధితులు వస్తుంటారని.. అందులో చాలా మంది అవగాహన రాహిత్యం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో వైద్య సౌకర్యాలు ఉన్నప్పటికీ.. సరైన సమయంలో చికిత్స అందించకపోవడంతోనే నష్టం జరుగుతోందన్నారు. సదస్సు నిర్వాహక చైర్మన్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ కేర్ ఆస్పత్రి 25 ఏళ్లుగా అందిస్తున్న అత్యవసర సేవల గురించి వివరించారు. కేర్ పరిపాలనాధికారి వడ్డిపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు.

6వేల మందితో మహా బృంద నాట్యం

- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ కోసం ప్రయత్నం
- డిసెంబర్ 24న గచ్చిబౌలి స్టేడియంలో ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: ఆరు వేల మంది కళాకారులతో కూచిపూడి కళా వైభవం పేరిట మహాబృంద నాట్యం నిర్వహిస్తున్నట్లు భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లయన్ కె.వి.లలితారావు, ఏబీసీ ఫౌండేషన్ అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సమక్షంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు కోసం డిసెంబర్ 24న గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 95151 12939, 72071 77000ను సంప్రదించవచ్చు.

మోదీ పాలన భేష్

ఎంపీ జీవీఎల్ నరసింహారావు



మాట్లాడుతున్న జీవీఎల్

ఎంవీపీకాలనీ: తొమ్మిదేళ్లుగా సుపరిపాలన అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు దఫాలుగా ప్రధాని నరేంద్రమోదీ దేశానికి సుపరిపాలన అందిస్తున్నా..ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ మరకలు అద్దాలని చూస్తోందన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిన చరిత్ర కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో సైతం సీట్లు గెలుచుకుంటామన్నారు. జనసేనతో బీజేపీ పొత్తు కొనసాగుతోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు.

యువతకు డాక్టర్ శివానంద ఆదర్శనీయం



డాక్టర్ శివానంద్ దంపతులను సత్కరిస్తున్న ఏడీసీపీ గంగాధరం

తగరపువలస: చిట్టివలసలో చదువుకుని పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పత్రి శివానందను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని క్రైం ఏడీసీపీ డి.గంగాధరం అన్నారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శివానందకు ఆదివారం పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా గంగాధరం మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో ప్రభుత్వ విద్యాసంస్థలు, వసతి గృహాలు, ఆస్పత్రుల్లో అంతగా సౌకర్యాలు ఉండేవి కాదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాడు - నేడు పథకం ద్వారా విద్యాసంస్థలు, వసతి గృహాలు, ఆస్పత్రులను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దారన్నారు. ఇదే పాఠశాలలో చదువుకుని కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా శివానంద్ ఎదిగి ఇక్కడి ప్రజలతో సత్కారం పొందడం గొప్ప విషయమన్నారు. సీఐ లూథర్‌బాబు, కార్పొరేటర్ కేవీఎన్ శశికళ, యలమంచిలి జూనియర్ కళాశాల సూపరింటెండెంట్ జీవీ అప్పారావు, గ్రామ పెద్దలు కాళ్ల శ్రీను, గొండేల అప్పారావు, వైద్యుడు సూర్యారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.